బోథ్‌లో 1.78 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు

బోథ్, డిసెంబర్ 6: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో శుక్రవారం వరకు 1,78,640.25 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వితల్ తెలిపారు. బోథ్, సొనాల, పొచ్చెర, నేరడిగొండ పరిధిలోని జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో 9430 మంది రైతులకు చెందిన 1,64,860.61 క్వింటాళ్ల పత్తిని, ప్రైవేట్ వ్యాపారులు 960 మంది రైతులకు చెందిన 13,779.64 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సీసీఐకి పత్తి విక్రయించిన రైతులకు సంబంధించి డిసెంబర్ 2 వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు కార్యదర్శి తెలిపారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో

బోథ్, డిసెంబర్ 6: ధన్నూర్(బీ) గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి సందర్శించారు. విద్యార్థుల హాజరు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు రావుల శంకర్, ఉపాధ్యాయులు సవిత, స్వప్న, ప్రశాంత్, సారిక ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

బోథ్, డిసెంబర్ 6: బోథ్, సొనాల, మండలాలకు సంబంధించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వందశాతం పూర్తయినట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. సొనాల మండలానికి సంబంధించిన 3,979 కుటుంబాలు, బోథ్ మండలానికి సంబంధించి 11,173 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించినట్లు పేర్కొన్నారు. రెండు మండలాల పరిధిలోని 33 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్వేను 136 మంది ఎన్యుమరేటర్లు ఆన్‌లైన్‌లో వివరాలను క్రోడికరించినట్లు పేర్కొన్నారు.

జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటు చేయాలి

ఇచ్చోడ, డిసెంబర్ 6: మండలంలో జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటు చేయాలని నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో దళిత గిరిజన విద్యార్థి సమస్యల గురించి బంజారా సంఘం రాష్ట్ర చైర్మన్ నరేందర్ నాయక్, బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు వినోద్‌నాయక్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు మెస్ ఫీజులు ప్రభుత్వమే చెల్లించే విధంగా జీవో విడుదల చేయాలని కోరారు.

రైతుల ఇబ్బందులను తొలగించాలి

ఎదులాపురం, డిసెంబర్ 6 : ఆదిలాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోయా, పత్తి కొనుగోళ్ల ప్రక్రియను శుక్రవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సోయా కొనుగోళ్లు, అలాట్‌మెంట్ పూర్తిస్థాయిలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సీసీఐకి సంబంధించి పత్తి కొనుగోళ్ల విషయంలో యజమాని స్వయంగా రావాలనే నిబంధనను సడలించాలని రైతులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతుల ఇబ్బందులను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి మధుకర్, బీజేపీ నాయకులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

ఖానాపూర్, డిసెంబర్ 6 : ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల రైతులకు యాసంగి సీజన్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈవో భూమి ఆశన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ 1010 దొడ్డు రకం వరి సీడ్స్ 25 కిలోల బ్యాగు సబ్సిడీపై రూ. 995కు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు తమ పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భైంసా, డిసెంబర్ 6: భైంసాలోని కేజీబీవీలో ఇంగ్లిష్ సీఆర్‌టీ మ్యాథ్స్, పీజీ సీఆర్‌టీ తాత్కాలికంగా బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ జ్యోతి తెలిపారు. సీఆర్‌టీ అర్హత బీఈడీ, డిగ్రీ, ఇంగ్లిష్ లిటరేచర్, పీజీ సీఆర్‌టీ అర్హత ఎమ్మెస్సీ బీఈడీ అర్హత గల వారు ఈ నెల 10 వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

నరసింహుని ఆలయ రథోత్సవానికి బ్యాటరీ విరాళం

దిలావర్‌పూర్, డిసెంబర్ 6: దిలావర్‌పూర్ మండలంలోని శ్రీ కాల్య లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఉన్న రథోత్సవానికి విద్యుత్ సౌకర్యం నిమిత్తం నిర్మల్ పట్టణానికి చెందిన దాత అడుముల్ల గంగాధర్ ఇన్వర్టర్ బ్యాటరీని శుక్రవారం ఆలయ పండితులకు అందజేసినట్లు ఆలయ మాజీ చైర్మన్ ఇప్ప నర్సారెడ్డి తెలిపారు. ఆలయ రథోత్సవానికి బ్యాటరీని అందించిన దాతలకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు.

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 6: బాలశక్తి కార్యక్రమాన్ని నిరంతరం పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బాలశక్తి కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి

ఇంద్రవెల్లి: మాట్లాడుతున్న పూజ్యభంతేజీ పూర్ణ

నార్నూర్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నిర్మల్‌అర్బన్: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అంబేద్కర్‌కు ఘన నివాళి

బోథ్/తాంసి/ఇచ్చోడ/నేరడిగొండ/తలమడుగు/ఇంద్రవెల్లి/నార్నూర్/నిర్మల్ అర్బన్/సారంగాపూర్/దిలావర్‌పూర్/నర్సాపూర్ (జీ)/భైంసా/కుంటాల/ముధోల్/బాసర/ ఖానాపూర్/కడెం/దస్తురాబాద్, డిసెంబర్ 6: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు.

బాసర: ట్రిపుల్‌ఐటీలో..

భైంసా: నివాళులర్పిస్తున్న నాయకులు



తాంసి: నివాళులర్పిస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ

ఉట్నూర్: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆటో బోల్తా: ఎనిమిది మందికి గాయాలు

భైంసా, డిసెంబర్ 6: కుభీర్ మండలం పల్సితండా వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని తోటంబ నుంచి నెక్లి వైపు వెళ్తున్న ఆటో శుక్రవారం రాత్రి పల్సితండా వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి.. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వారు చేరుకొని క్షతగాత్రులను భైంసా ఏరియా దవాఖానకు తరలించారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

జైనథ్, డిసెంబర్ 6: జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాండగడకు చెందిన బావునే నగేశ్, తుమానే గంగారాంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. బావునే నగేశ్, తుమానే గంగారాం ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్ నుంచి మాండగడకు వెళ్తుండగా పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో నిలిచి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉట్నూర్‌లో దొంగతనం

ఉట్నూర్, డిసెంబర్ 6: ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని అంగడిబజార్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు జాదవ్ రమేశ్ ఇంట్లో దొంగతనం జరిగింది. రమేశ్ ఇంట్లో ఇటీవల వివాహం జరుగగా కుటుంబీకులు హైదరబాద్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో తాళం వేసిన ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఉదయం చుట్టూ పక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డెర కులస్తుల అభ్యున్నతికి కృషి

● బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ● సుంకిడిలో స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న విగ్రహావిష్కరణ



తలమడుగు: ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

తలమడుగు, డిసెంబర్ 6: వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం సుంకిడి గ్రామంలో ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న విగ్రహాన్ని వడ్డెర కులస్తులు, మండల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో కలపాలని కొన్ని సంవత్సరాల నుంచి వారి డిమాండ్ ఉందన్నారు. వారిని ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు వారి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. వారి హక్కుల కోసం పోరాటం చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు సంఘం నాయకులను వడ్డెర కులస్తులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వడ్డెర జాతి రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రాజు, మండలాధ్యక్షుడు రాజమల్లు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, మాజీ జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణం రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, నాయకులు మహేందర్, గెల్ల వెంకటి, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, పిడుగు అభిరాం రెడ్డి, మొట్టె కిరణ్, వడ్డెర కులస్తులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

నేరడిగొండ, డిసెంబర్ 6 : విద్యతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ గ్రామంలో రూ.17.70 లక్షల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదిని ప్రారంభించారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నేరడిగొండ, ఇచ్చోడ మండల కన్వీనర్లు శివారెడ్డి, కృష్ణారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, ఎంఈవో భూమారెడ్డి, నాయకులు రాథోడ్ సురేందర్, బాబులాల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి

కుంటాల, డిసెంబర్ 6 : కుంటాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం మూసివేయడంతో ఒక చిన్న గదిలో వైద్య సేవలు నిర్వహిస్తుండడం బాధకరమని మిషన్ కుంటాల చైర్మన్ డీ వెంకటేశ్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి పేద ప్రజలు వైద్య పొందడానికి వస్తుంటారని, గతంలో స్థానిక ఎమ్మెల్యేకు అప్పటి సర్పంచ్ సమత విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఈ సమస్యతో పాటు పీహెచ్‌సీని 30 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్తులతో కలిసి శుక్రవారం తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నరేశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిరాహార దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు. ఆయన వెంట లక్ష్మణ్, రమేశ్, నితిన్, గజేందర్ ఉన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దయినందుకు మొక్కులు చెల్లించిన మహిళా రైతులు

దిలావర్‌పూర్ డిసెంబర్ 6 : నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ –గుండంపల్లి గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వ అధికారులు కొన్ని రోజుల క్రితం ప్రకటించడంతో శుక్రవారం గుండంపల్లికి చెందిన మహిళా రైతులు దుర్గాదేవి ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గత శుక్రవారం గ్రామానికి చెందిన దాదాపు 300 మంది మహిళలు ఆలయానికి వచ్చి తమ గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫ్యాక్టరీని రద్దు అయ్యేలా చూడాలని మొక్కుకున్నారు. రెండోవారం ఇథనాల్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించడం రైతులు, మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద సహాపంక్తి భోజనాలు చేశారు.

ఘనంగా కైలాష్ టెకిడి వార్షికోత్సవాలు

బోథ్, డిసెంబర్ 6: బోథ్ మండలంలోని నిగిని అటవీ ప్రాంతంలో కైలాష్ శిఖర గుట్టపై కొలువై ఉన్న నర్మదేశ్వరుని ఆలయ 22వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం రుద్రాభిషేకం, హారతి, మండల పూజ, కలశ స్థాపనం, అగ్నిస్థాపన హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు సంత్ శ్రీ లింబాజీ మహారాజ్, అగ్ని స్థాపన హోమంలో పాల్గొని పూజలు చేశారు. బోథ్, మహారాష్ట్రలోని కిన్వట్, ఇస్లాపూర్, నాందేడ్, మహోర్, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్, భైంసా తదితర ప్రాంతాల నుంచి వందలాది భక్తులు ఆలయానికి వచ్చిన నర్మదేశ్వరుడిని దర్శించుకున్నారు.

విద్యాభివృద్ధికి పునాదులలో మార్పు అవసరం

ఉట్నూర్, డిసెంబర్ 6: విద్యాభివృద్ధి జరగాలంటే దాని పునాదులలో మార్పు చాలా అవసరమని విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ అన్నారు. శుక్రవారం ఉట్నూర్, ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ ప్రభుత్వం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాపల్‌గూడ పాఠశాల బెస్ట్ స్కూల్ అని ప్రశంసించారు. అక్కడి నుంచి జడ్పీఎస్ఎస్ మిడిగూడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం ఉట్నూర్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి, ఐటీడీఏ పీవోతో కలిసి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యావ్యవస్థలో అమలువుతున్న కార్యక్రమాలు, విద్యా వ్యవస్థలో చేపట్టబోయే సంస్కరణలపై అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో ఐటీడీఏ అధికారులు, ఏపీవో వసంత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ముధోల్, డిసెంబర్ 6 : ముధోల్‌లోని రబీంద్ర పాఠశాలలో అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల్లో భాగంగా అహల్యాబాయి హోల్కర్ పుస్తక, కరపత్రాలను అప్పాల ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, డైరెక్టర్ పోతన్న యాదవ్, కరస్పాండెంట్ రాజేందర్, వీడీసీ అధ్యక్షులు నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ కార్డుల అందజేత

దస్తురాబాద్, డిసెంబర్ 6 : మున్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అపార్ ఐడీ కార్డులను ప్రధానోపాధ్యాయుడు వామన్‌రావు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

దిలావర్‌పూర్, డిసెంబర్ 6 : మాడెగాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీవో గోవర్ధన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. చిన్నారులతో ఆయన మాట్లాడారు. మెనూప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. చిన్నారులకు కావాల్సిన ఆట వస్తువులు గ్రామ పంచాయతీ ద్వారా సమకూర్చడం జరిగిందని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్యం సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సునీల్ కారోబార్, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 6 : నిర్మల్‌లోని మంజులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్బీఎస్కే టీం విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఐవో నయనారెడ్డి, ఆర్బీఎస్కే ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీనాథ్, చైల్డ్ హెల్త్ టీం విద్యార్థులు పాల్గొన్నారు.

కొలాంగూడలో వైద్యశిబిరం

ఇచ్చోడ, డిసెంబర్ 6: కొలాంగూడ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సికిల్ సెల్, లెప్రసీ, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, రేణుక, సంగీత, తిరుమల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజంతోనే దేశం అభివృద్ధి

ర్యాలీ తీస్తున్న ఆర్డీవో, ఏసీబీ సీఐ, రెవెన్యూ ఉద్యోగులు

ఎదులాపురం, డిసెంబర్ 6 : అవినీతి రహిత సమాజం దేశాభివృద్ధికి ఏకైక మార్గమని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో అవినీతి నిరోధక శాఖ వారోత్సవాలు నిర్వహించారు.ఏసీబీ కార్యాలయం నుంచి ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. లంచం తీసుకోవడం, ఇవ్వడం నేరామంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఎవరైన లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐ ఎం స్వామి, హెడ్ కానిస్టేబుల్ మార్కండేయ, కానిస్టేబుళ్లు దేవేందర్, స్వామి పాల్గొన్నారు.

ఉద్యమ దినోత్సవం సభ ఏర్పాటుకు స్థల పరిశీలన

సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 6: ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద ఈ నెల 9వ తేదీన నిర్వహించే ఆదివాసీ హక్కుల ఉద్యమ దినోత్సవం సభ ఏర్పాటుకు స్థలాన్ని శుక్రవారం రాయిసెంటర్ పెద్దలతో పాటు ఆదివాసీ పెద్దలు, తుడుందెబ్బ నాయకులు పరిశీలించారు. ఈ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాయిసెంటర్‌ల సార్‌మేడిలు, గ్రామపటేళ్లు, ఆదివాసీ పెద్దలతో పాటు తుడుందెబ్బ నాయకులు, తొమ్మిది తెగలకు చెందిన కుల సంఘాల నాయకులు, మేధావులు, ఆదివాసీ ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు వెంకట్‌రావ్‌పటేల్, సిడాం భీంరావ్, ఆర్కా ఖమ్ము, గణేశ్, వెట్టి మనోజ్, బారిక్‌రావ్, పుర్కా చిత్రు, జుగ్నాక్ భరత్, కుమ్ర భీంరావ్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నార్నూర్, డిసెంబర్ 6 : ఇంద్రవెల్లిలో ఈ నెల 9వ తేదీన నిర్వహించే ఆదివాసీ హక్కుల ఉద్యమ దినోత్సవం సభకు ఆదివాసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదిరావ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గాదిగూడలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద ఆయన మాట్లాడారు. ఈ సభకు తొమ్మిది తెగల ఆదివాసీలు, ఉద్యోగస్తులు, ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు, మేధావులు, మహిళలు, యువతి, యువకులు పాల్గొనాలని కోరారు. అంతకుముందు నూతనంగా ఎన్నికైన విద్యార్థి సంఘం నాయకుడిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చంద్రహరి, మాజీ సర్పంచ్ మెస్రం జైవంత్‌రావ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు మధు, గంగారాం, గోవింద్, ప్రభాకర్, నటరాజ్, శంభు, యశ్వపంత్‌రావ్, సోనేరావ్, దాదిరావ్, శంకర్, శ్యాంరావ్, కిషన్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ముధోల్, డిసెంబర్ 6 : ముధోల్ మండలం ఆష్టా గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.15లక్షలతో చేపడుతున్న ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ భూమిపూజ చేశారు. క్రీడారంగంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేసి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అతి త్వరలో పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, ముధోల్ మాజీ ఎంపీటీసీ భూమేశ్, సీనియర్ నాయకుడు మోహన్ రెడ్డి, యువ జన సంఘం సభ్యులు సతీశ్ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 6 : పెండింగ్ లెప్రసీ, పల్స్ పోలియో డబ్బులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పోశెట్టి అన్నారు. నిర్మల్ టీఎన్జీవో భవన్‌లో జిల్లా నాయకురాలు చంద్రకళ అధ్యక్షతన శుక్రవారం ఆశ యూనియన్ సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డబ్బులను ఆశకార్యకర్తల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసిన తర్వాతనే కొత్త సర్వేలు చేపట్టాలన్నారు. అంతవరకు లెప్రసీ సర్వే చేపట్టకూడదన్నారు. ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన చేపడుతున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆశకార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, విజయ, ఇంద్రమాల, అనసూయ, సుగుణ, కమల, శ్యామల, లక్ష్మి, సులోచన, నంద, లత పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం అందించాలి

నేరడిగొండ, డిసెంబర్ 6 : రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. ఇటీవల వడూర్ గ్రామానికి చెందిన అడుముల్ల సత్య నారాయణ అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకుని కుటుంబాన్ని పరామర్శించారు. అధిక వర్షాల కారణంగా పెట్టుబడులు పెరిగి అప్పులు భారంగా మారడంతో మనోవేదనకు గురై అడుముల్ల సత్య నారాయణ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వం ప్రకటించిన జీవో 194 ప్రకారంగా బాధిత కుటుంబానికి ఆరు లక్షలు పరిహారం చెల్లించి, ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబ యజమానురాలికి నెలకి రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, వారి పిల్లలకు ఉన్నత విద్య, వైద్య సదుపాయం అందించాలన్నారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

ఆటో బోల్తా: ఎనిమిది మందికి గాయాలు

భైంసా, డిసెంబర్ 6: కుభీర్ మండలం పల్సితండా వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని తోటంబ నుంచి నెక్లి వైపు వెళ్తున్న ఆటో శుక్రవారం రాత్రి పల్సితండా వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి.. గమనించిన స్థానికులు